క్లుప్తంగా

ఐరిష్ ధ్రువీకరణతో రేషన్ పంపిణీ

బొండపల్లి: వేలిముద్రలు పడని వారికి వచ్చే నెల నుంచి ఎండీయూ ఆపరేటర్లు ఐరిష్ మిషన్‌తో ఫొటోలు తీసి రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని సివిల్‌సప్లై డీటీ రవిశంకర్ తెలిపారు. ఇంతవరకు బయోమెట్రిక్ విధానం ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయడం జరిగిందని, ఇకపై వేలిముద్రలు పడని వారికి ఐరిష్ ద్వారా ఎండీయూ ఆపరేటర్లే నేరుగా సరుకులు అందజేస్తారన్నారు.

డీసీహెచ్‌ఎస్ ఆకస్మిక తనిఖీ



ప్రాంతీయ ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్

గజపతినగరం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీశంకర్ అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఫిజియోథెరపీ పరికరాలు అందుబాటులో ఉండడంతో ఫిజియోథెరపీ అవసరమైన రోగులకు పూర్తిస్థాయిలో సేలందించాలని సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, ఆర్‌ఎంఓ డాక్టర్ నాయుడు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారు.

28 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబ

గుర్ల: మండలంలోని సాలిపిసోమరాజుపేట వద్ద ఉన్న శ్రీలక్ష్మీ బాలాజీ నర్సింగ్ హోమ్‌లో మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పెనుమత్స సురేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 28 మంది యువకులు రక్తదానం చేసినట్లు మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో లోకసత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, వైద్యాధికారులు అల్తి రమణ, ఎన్.వి.ఎన్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.


భూ ఆక్రమణపై విచారణ



ఆక్రమణలపై విచారణ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో ఏఎంజీ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు స్పందనలో ఫిర్యాదు చేయడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.సుదర్శన దొర శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఎంత మేర ఆక్రమణకు గురైంది, వాటి సర్వే నంబర్లు తదితర వివరాలను ఆరా తీశారు. ఏఎంజీ కాలనీని సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసన రాఘవ, మండల సర్వేయర్ పి.అప్పలస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రియ ఉన్నారు.

శాశ్వత అన్నదానానికి రూ.10 వేలు విరాళం



రూ.10 వేలు అందజేస్తున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: పట్టణంలోని లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని తన మనమడు గద్దే అనురాఘ్ చౌదరి చేతులమీదుగా లైన్స్‌క్లబ్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్‌క్లబ్ నేతృత్వంలో శాశ్వత అన్నదాన పథకం చాలా గొప్పగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వృథా ఖర్చులు తగ్గించుకుని శాశ్వత అన్నదాన పథకానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎస్.రాధాకృష్ణ, కె.తవిటిరాజు, నాగశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ముఖ్యమంత్రి మానస పుత్రికలు

● ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు

లక్కవరపుకోట: ప్రజలకు ప్రభుత్వ సేవలందించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీరభద్రపేట గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 8 మంది వలంటీర్లను సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వలంటీర్ల నిస్వార్థ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారికి ఏటా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సుమారు రూ.239.69 కోట్లు కేటాయించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ దొర, కొట్యాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ముఖ్యమంత్రికి అచంచల విశ్వాసం

గంట్యాడ: వలంటీర్లపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అచంచలమైన విశ్వాసం ఉందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం, సిరిపురం సచివాలయ పరిధిలో ఉన్న వలంటీర్లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని 2024లో మరోసారి సీఎంను చేసేలా వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మ పాల్గొన్నారు.



రామవరంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి

పురస్కారాలకు వలంటీర్లు ఎంపిక

దత్తిరాజేరు: మండలం నుంచి సేవా వజ్ర అవార్డుకు ఇద్దరు, సేవారత్న అవార్డుకు ఐదుగురు ఎంపికైనట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మిగిలిన వలంటీర్లు సేవా మిత్ర అవార్డును అందజేయనున్నట్లు చెప్పారు. దత్తి వలంటీర్ జగదాంబ, గడసాం వలంటీర్ వెంకటరమణ వజ్ర అవార్డుకు, గడసాం, మరడాం, కె.కొత్తవలస, వి.క్రిష్టాపురం, వంగర వలంటీర్లు పైడిరాజు, అప్పారావు, మౌనిక, సురేష్, నారాయణ సేవారత్నకు ఎంపికై నట్లు తెలిపారు. వీరికి త్వరలోనే అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు చెప్పారు.

సేవలకు గుర్తింపుగా పురస్కారాలు

గజపతినగరం: ఈనెల 23 నుంచి ఉత్తమ సేవలందించిన గ్రామ వలంటీర్లకు అవార్డులను ప్రదానం చేయడంతో పాటు సన్మానించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పప్పు సుదర్శనం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మే నెల 23న పురిటిపెంట, 24న కొత్తబగ్గాం, 25న మరుపల్లి, 26న ముచ్చర్ల, 27న తుమికాపల్లి, 30న కాలంరాజుపేట గ్రామ సచివాయాల్లో అవార్డులు ప్రదానంతో పాటు సన్మానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. గజపతినగరం మండలంలో మొత్తం 292 మంది వలంటీర్లకు గాను ఒకరికి వజ్ర, ఐదుగురుకి సేవారత్న, మిగతా 286 మందికి సేవామిత్ర అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కొత్తవలస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో గత నెలలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసారావు, ఎమ్మెల్యే కడుబండ శ్రీనివాసరావు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో తాగునీటి సమస్యను స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు తక్షణమే సమస్యను పరిష్కరించి కాలనీవాసులకు తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజును ఆదేశించారు. దీంతో అధికారులు సుమారు రూ.5లక్షలతో యుద్ధప్రాతిపదికన తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. శుక్రవారం నాటికి పనులు పూర్తి చేసి కాలనీవాసులకు తాగునీరు అందించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి



బొండపల్లి: రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఝాన్సీ



గజపతినగరం: రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ అంజలి

బొండపల్లి: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సీ కోరారు. మండలంలోని గొల్లుపాలెం పంచాయతీ పరిధి గూడెం గ్రామంలో శుక్రవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.నారాయణప్పలనాయుడు పాల్గొన్నారు.

117 మందికి వైద్య సేవలు

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అంజలి సుమారు 117 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు, గర్భిణులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త మంగవేణి, ఆశా వర్కర్లు ఆదిలక్ష్మి, కనక, డీఈఓ సంతోష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ఆదుకుంటాం

● దాసరి కులస్తులతో మాజీ సీఎం చంద్రబాబు ముఖాముఖి

శృంగవరపుకోట: అధికారంలోకి వస్తే దాసరి కులస్తులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తామంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎస్.కోట పట్టణంలోని శిరికి కన్వెన్షన్‌లో శుక్రవారం టీడీపీ ముఖ్య నాయకులతో కలిసి దాసరి కులస్తులతో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో అభివృద్ధి పడకేసిందని, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా పాలన సాగిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దాసరి కులస్తులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు దాసరికుల పెద్దలు తమ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి, కోండ్రు మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర ప్రాంతంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షం ధాటికి మరుపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి సత్తిబాబుకు చెందిన 17 మేకలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం ఉదయం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. అనంతరం మరుపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎమ్మెల్సీ వెంట ఎంపీపీ సండి సోమేశ్వరరావు, మురళీరాజు, దేముడు, సుంకరి బుల్లి ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

బొండపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సీ అన్నారు. మండలంలోని గొల్లుపాలెం పంచాయతీ పరిధి గూడెం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. మురుగునీరు దోమలకు ఆవాసాలుగా మారుతాయని, తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు. సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి

వేపాడ: గత ప్రభుత్వ హయాంలో రైతులు నిర్మించిన మినీ గోకులాలకు బిల్లులు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ పట్నాయక్‌కు వినతి పత్రం అందచేశారు. గత ఏడాది అధిరానేలే కొంత మొత్తం చెల్లించి ఊరుకున్నారని గుర్తుచేశారు. అప్పట్లో పశువైద్యాధికారులు ఇచ్చిన కొలతల మేరకు పశువుల షెడ్‌లు నిర్మించారన్నారు. అధికారులు స్పందించి మినీ గోకులాలు బిల్లులు చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అప్పలనాయుడు, సాయి, చంద్రరావు, సత్తిబాబు, ఎర్రన్న, రామరావు తదతరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

వేపాడ: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు హెచ్‌టీటీపీ://ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్/ఏపీఎంఎస్ ఆన్‌లైన్‌లో ఈ నెల 22 నుంచి జూన్ 6 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. పదోతరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ మేరకు సీట్లు కేటాయించటం జరుతుందన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన తోండ్రంగి హైస్కూల్ విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రీ కళాశాల కరస్పాండెంట్, సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఏవీ రమణరాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల నుంచి సీహెచ్ భవానీ, సి.ప్రసన్న, కె.దేవి, ఎస్.హేమ, పి.ఆదిలక్ష్మి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థుల ఎంపికపై పీడీ సత్యనారాయణ, యోగా ఉపాధ్యాయుడు ఆనంద్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు క్రీడా దుస్తుల కోసం హెచ్‌ఎం రూ.5వేలు అందజేశారు.

చీపురుపల్లి: రాష్ట్రస్థాయి అండర్-19 ఖోఖో, కబడ్డీ పోటీలకు పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో కళాశాల నుంచి నిద్దాన ఇంద్రావతి, బెవర ధనుష్ ఖోఖో విభాగంలో, మజ్జి హరి, ఎజ్జిపు రపు స్వాతి కబడ్డీ విభాగంలో పాల్గొంటారన్నారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాసరి శివప్రసాద్, ఏఓ కె.రాజు, పీఈటీ బి.శ్రీను అభినందించారు.

ప్రజలు మెచ్చేలా సీఎం జగన్ పాలన



లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా పాలన చేస్తున్నారని గరివిడి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. శేరీపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా పాలన ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, పేదలను పక్కన పెట్టిన టీడీపీని ప్రజలు పూర్తిగా విస్మరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పిల్ల ఆదినారాయణ, జమ్ము కృష్ణ, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లి: సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ నేత్ర, అవయవదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పిల్లపేట, రుంకానవీధి పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు శుక్రవారం వెళ్లి వేతనదారులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. మనం మరణిస్తే మనతో పాటు మన కళ్లు, ఇతర అవయవాలు కూడా మట్టిలో కలిసిపోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదని, వాటిని దానం చేయడం ద్వారా మరొకరికి మేలు జరుగుతుందన్నారు. మూఢనమ్మకాలు విడిచిపెట్టి ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 120 మంది వేతనదారులు నేత్ర, అవయవదానం చేసేందుకు తమ అంగీకారాన్ని తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

శృంగవరపుకోట: అనారోగ్య సమస్యలతో చనిపోయిందని చెబుతున్న వివాహిత మృతి అనుమానాస్పదంగా ఉంది. ఎస్.కోట పోలీసులు అందించిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎస్.కోట మండలం తలారి గ్రామంలో అల్లు పార్వతి(25) ఉరిపోసుకుని చనిపోయింది. ఆమెకు కొన్నేళ్ల క్రితం పెదఖండేపల్లి గ్రామానికి చెందిన ఎర్రిబాబుతో వివాహం జరిగింది.

వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని పోలీసులు చెబుతున్నారు. మృతురాలి తండ్రి మిడతాన అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా..



మహిళా రెజ్లర్లకు మద్దతిస్తున్న వివిధ సంఘాల నాయకులు

చీపురుపల్లి: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు గొర్లె పద్మ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేయడం అమానుషమన్నారు. వేధింపులకు పాల్పడిన ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్, తూర్పుకాపు సంఘం, జనజాగృతి, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా నగదు అందిస్తున్న ఐకేపీ ఏపీఓ శ్రీనివాసరావు, తదితరులు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ గ్రామానికి చెందిన పూడి సూర్యం మృతి చెందడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం మంజూరైంది. ఐకేపీ ఏపీఓ ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ గాడి గంగతల్లి, తదితరులు శుక్రవారం మృతురాలి భర్త రమణకు తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. మరణ ధ్రువీకరణ పత్రం అందిన వెంటనే మిగిలిన సహాయం బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మిరపాక రమణ, ముత్యాలునాయుడు, నారాయణమూర్తి, వీఓఏ లక్ష్మి, వలంటీర్లు శంకరరావు, రమాదేవీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పవర్ టిల్లర్ అందచేత

వేపాడ: ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగరాయి సర్పంచ్ నిరుజోగి వెంకటరావు కోరారు.

కస్టమ్ హైరింగ్ సెంటర్ (వైఎస్సార్ యంత్రసేవా) పథకం కింద గ్రామంలోని రైతుభరోసా కేంద్రం వద్ద శుక్రవారం రైతుసంఘానికి పవర్ టిల్లర్‌ను రాయితీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ వాటాగా పది శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందని, మిగిలిన మొత్తం బ్యాంక్ ద్వారా రుణం అందిస్తుందన్నారు.

పిచ్చికుక్క దాడిలో 15మందికి గాయాలు



వైద్య సేవలు పొందుతున్న వృద్ధుడు, చిన్నారి

గజపతినగరం: మండల కేంద్రంలో గురువారం రాత్రి పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచింది. గజపతినగరంలోని మేదరవీధి, కుమ్మర వీధి, కోనేటి గట్టు, సంతతోట, షరాబుల కాలనీతో పాటు పలు చోట్ల సుమారు 15మందిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి కొంత మంది ప్రథమ చికిత్స చేసుకోగా మరి కొంతమంది శుక్రవారం ఆస్పత్రిలో చేరారు. కుక్క కాటుకు గురైన వారికి డాక్టర్ ప్రవీణ వైద్య సేవలు అందిస్తున్నారు. గాయాలపాలైన వారిలో చిన్నారులు కూడా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. గ్రామస్తులను పిచ్చికుక్కను తరిమితరిమి కొట్టి హతమార్చారు.

పుచ్చలపల్లి జీవితం ఆదర్శం



కొత్తవలస: ఎర్రవానిపాలెంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధి వేతనదారులు

కొత్తవలస, శృంగవరపుకోట, గజపతినగరం రూరల్: కమ్యూనిస్ట్ ఉద్యమ నేత, పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. పుచ్చలపల్లి పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



శృంగవరపుకోట: పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు



గజపతినగరం రూరల్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, తదితరులు

కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అరుణ

జామి: మండలంలో లొట్లపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకం పనులకు ఎంపీపీ సబ్బవరపు అరుణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.9లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగునీటి కష్టాలకు పరిష్కారం లభిస్తుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జన్నేల సింహాచలం, వైఎస్సార్‌సీపీ నేతలు జె.సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

23 తాగునీటి బోర్లు మంజూరు

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాలల్లో వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు 23 బోర్లను మంజూరు చేసినట్లు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని లచింపేట, రేగ, కోనమసివానిపాలెం, కిత్తన్నపేట తదితర గ్రామాల్లో బోర్లు వేసినట్లు చెప్పారు. ఒక్కో బోరుకు లక్షా 20 వేల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు.